క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వెటర్నరీ జేడీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటనారాయణ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె.వెంకటనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెటర్నరీ జేడీని అభినందించారు.

సన్మానం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కోటపాటి రుక్మారావును శుక్రవారం ఎస్సీ సంక్షేమ వసతిగృహాల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది జి.వినోద్, శేఖర్, ఇంద్రజ, ఝాన్సీ, మున్ని, కళావతి, లక్ష్మి, నరేష్, ఎస్.తిరుపతిరావు, విజయ్, సేతురామ్, యాకూబ్, మాన్సింగ్, వెంకన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

ఖమ్మంలీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. నిర్భయ చట్టం, మాస్ కాపీయింగ్, పిల్లల అక్రమరవాణాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్‌రెడ్డి, విద్యాలయం ముఖ్య పర్యవేక్షణాధికారి ఆసియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

కామేపల్లి: మండలంలోని బర్లగూడెంలో మంచినీటి బావి స్టీరింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని మాజీ ఉపసర్పంచ్ బానోత్ బాబునాయక్ అన్నారు. మరమ్మతులకు గురై గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని, వెంటనే బావి స్టీరింగ్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపి నిర్మాణం పూర్తి చేయాలని శుక్రవారం అధికారులను కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

నేలకొండపల్లి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తేందుకు బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భువనాసి దుర్గారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, గెల్లా సాయి, కోండ హర్ష, కళ్యాణం నాగేశ్వరరావు, తోగాటి నాగాచారి, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల వెనుక భాగంలో ఉన్న సుమారు ఆరు కుంటల ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న రియల్ వెంచర్‌దారులు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని, ఈభూమిని కాపాడాలని గ్రామానికి చెందిన వీరబాబు మరికొందరు శుక్రవారం ఖమ్మం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే సర్వే చేసి ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని గ్రామంలోని ఇళ్ల స్థలాలు లేని పేదలకు అందించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని కోరారు.

'ఎస్సీ వర్గీకరణలో మాదిగల నైరాశ్యం'

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణలో మాదిగలు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారని, వర్గీకరణకు అడ్డుపడేది మంద కృష్ణమాదిగే అని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి ప్రారంభించింది ఆయనే, నేడు అడ్డుపడేది మంద కృష్ణేనని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టే గురుమూర్తి, బహుజన నాయకులు నకరికంటి సంజీవరావు, శ్రీనివాస్, కొరకొప్పు రామారావు, రాయల రాంబాబు, మోదుగు జోగారావు, వీరస్వామి, విజయ్, మురళి, భుజంగరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించడం దగ్గర నుంచి వాటిని తిరిగి చెల్లించే వరకూ మెప్మా అధికారులు, క్షేత్రస్థాయిలో ఆర్పీలు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. కానీ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్షేత్రస్థాయి ఆర్పీల నుంచి సీఓలు, ఆ పైస్థాయి ఉద్యోగులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఇటీవల ఆర్పీలపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలే నిదర్శనమంటున్నారు. కొంత మంది ఆర్పీలు మహిళా సభ్యులకు మంజూరైన రుణాన్ని తమ సొంతానికి వినియోగించుకుని సకాలంలో బ్యాంకులకు చెల్లించడం లేదు. దీంతో బ్యాంకర్లు మహిళా సభ్యులకు నోటీసులు ఇస్తూ ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇంకొందరు ఆర్పీలు బినామీ గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు కాజేస్తున్నారు. – ఖమ్మంమయూరిసెంటర్

మెప్మా.. మాయలు!

ఇష్టారీతిన ఆర్పీల వ్యవహారం

- ఎస్‌హెచ్‌జీల రుణాలు పక్కదారి
- సకాలంలో చెల్లించక నోటీసుల జారీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- బకాయిల వసూళ్లపై పట్టింపు కరువు

నోటీసులు జారీ..

బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా మహిళా సభ్యులకు రుణాలు మంజూరైన తర్వాత తిరిగి నెలనెలా రుణ బకాయిలను మహిళా సభ్యులు చెల్లిస్తుంటారు. అయితే ఖమ్మం నగరంలో కొంతమంది ఆర్పీల వ్యవహార శైలితో రుణాలు పక్కదారి పడుతున్నాయి. అంతేకాక రుణాల చెల్లింపులో జాప్యం జరగడంతో బ్యాంకర్లు మహిళా సభ్యులకు నోటీసులు జారీ చేస్తుండడంతో వారు తాము ఇంత రుణం ఎప్పుడు తీసుకున్నామని అవాక్కవుతున్నారు. ఆరా తీస్తే ఆర్పీనే ఆ నగదును కాజేసినట్లు గుర్తిస్తున్నారు.

పర్యవేక్షణ లేక..

సంఘం ఏర్పాటు నుంచి సంఘ సభ్యులకు రుణాలు మంజూరు చేయించడం, తిరిగి వసూళ్లు చేయించే బాధ్యతలను క్షేత్రస్థాయిలో ఆర్పీలు చూడాలి. వీరిపై సీఓలు, టీఎంసీ నిరంతరం పర్యవేక్షిస్తుండగా.. వీరిపై డీఎంసీ, పీడీ స్థాయి అధికారులు పరిశీలిస్తూ సూచనలు చేయాల్సి ఉంది. కానీ ఒక్కరిపైనా ఎక్కడా పర్యవేక్షణ చేసిన దాఖలాలు జిల్లాలో కనిపించడం లేదు. రుణం తీసుకున్న తర్వాత మహిళా సభ్యురాలు అదే ప్రాంతంలో ఉంటుందా.. లేదా అనేది కూడా చూడని ఆర్పీలు ఉన్నారు. రుణం ఇప్పించే ముందు కూడా సభ్యుల ఇళ్లను సందర్శించిన దాఖలాలు లేవు.

> ప్రకాష్‌నగర్ ప్రాంతంలోని ఆర్పీ కూడా ఇదే తరహాలో మహిళా సభ్యులకు వచ్చిన రుణాన్ని కాజేసినట్లు తెలిసింది. అయితే ఇక్కడ బ్యాంకర్లు రుణాలను మంజూరు చేసే సమయంలో సభ్యులను కూడకుండానే విడుదల చేశారనే విమర్శలు వస్తున్నాయి. మెప్మా సిబ్బంది మాయచేసి బ్యాంకర్ల ద్వారా రుణాలు పొందినట్లు కేఎంసీలో చర్చ జరుగుతోంది.

మామూళ్లతోనే సరి..

మెప్మాలో జరుగుతున్న అవకతవకలకు అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. సభ్యులకు రుణం ఇప్పించే సమయంలో వారు తీసుకునే కమీషన్లపై దృష్టి సారిస్తున్నారే తప్ప ఆ తర్వాత సంఘాల నిర్వహణ, నగదు సద్వినియోగం, మహిళల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. రూ.లక్ష రుణం ఇప్పిస్తే ఆర్పీ రూ.5వేలు వసూలు చేస్తుండగా.. ఆపై సీఓ రూ.2వేలు, ఆపై అధికారులు మరికొంత దండుకుని సంఘాలను గాలికి వదిలేస్తున్నట్లు చర్చ సాగుతోంది. మెప్మాలో ఆర్పీల వ్యవహార శైలిపై అధికారులను వివరణ కోరగా.. ఒకరిద్దరు ఆర్పీలు రుణ నగదు వాడుకుంటున్నారని, ఫిబ్రవరి, మార్చి సమయంలో కనిపించకుండా పోతున్నారని తెలిపారు. ఆ తర్వాత వచ్చి బ్యాంకర్లతో సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, మెప్మాపై వస్తున్న కొన్ని ఆరోపణలు మాత్రం అవాస్తవమని చెప్పడం గమనార్హం.

సాగునీటికి ఇబ్బందులు రానివ్వొద్దు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

తిరుమలాయపాలెం: మండలంలోని రబీ సాగు చేపట్టిన పంటలకు సాగు నీరు, విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.వి రామకృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుమలాయపాలెం తహసీల్ ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. చివర ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని, బావులు, బోర్ల ద్వారా సాగవుతున్న పంటలకు విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, ఇరిగేషన్ ఏఈలు రామకృష్ణ, శ్రీనివాస్, విద్యుత్ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

నర్సరీలకు షేడ్‌నెట్ల ఏర్పాటు


కొత్తకొత్తూరు నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీదేవి

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండలంలోని నర్సరీలకు ఎట్టకేలకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం ఏర్పాటు చేసే షేడ్‌నెట్లను ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తుండడంతో శుక్రవారం 'సాక్షి'లో 'నిర్లక్ష్యపు నీడలో నర్సరీలు'అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీదేవి మండలంలోని కొత్తకొత్తూరు, తిరుమలాపురం పంచాయతీలలోని నర్సరీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి షేడ్‌నెట్లు లేకపోవటంతో ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, వెంటనే షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని, నీటి సౌకర్యం అందించేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట ఈజీఎస్ అధికారులు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

కేఎంసీ కమిషనర్‌ను కలిసిన కుండల విక్రయదారులు

ఖమ్మంమయూరిసెంటర్: మట్టి కుండలు, మట్టి పాత్రలను విక్రయించుకునేందుకు ఇల్లెందు క్రాస్‌రోడ్డులో గల పాత మార్కెట్ స్థలాన్ని ఇవ్వాలని కోరుతూ శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన కుమ్మరులు శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిశారు. ఇల్లెందు క్రాస్ రోడ్డులోని రోడ్డు వెంట అమ్ముకునే తమను ఉన్నపలంగా నాన్‌వెజ్ మార్కెట్‌కు తరలించడం ద్వారా వ్యాపారాలు జరగడం లేదని, పాత మార్కెట్ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ.. స్థలాన్ని ఐటీ హబ్–2కు కేటాయించామని, రోడ్డు వెంట ఎటువంటి వ్యాపారాలకు అనుమతి లేదని, కొద్దిరోజుల వరకు వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవి రామయ్య, ట్రస్ట్ బాధ్యులు వెంకటరమణ, రాధాకృష్ణ, పాపారావు, రమేష్, పరుశురాములు పాల్గొన్నారు.

కొక్కిరేణి శివాలయంలో గణపతి పూజలు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి గ్రామంలో ఉన్న పురాతన శివాలయంలో శుక్రవారం గణపతి దేవుడి విగ్రహం పునఃప్రతిష్ఠ సందర్భంగా గ్రామస్తులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ అమ్మవారికి, గణపతి దేవుడికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆడపడుచులు జల బిందెలతో జలాభిషేకాలు, తేనె, పాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భజనలు కోలాట నృత్యాలు నిర్వహించారు.

జాబ్ మేళా..


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవికుమార్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఈడెన్ స్పోర్ట్స్ ఆధ్వర్యాన శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. కంపెనీ బాధ్యులు వి.నాగబాబు, శేఖర్, డేవిడ్ పాల్గొనగా నైపుణ్యాల ఆధారంగా 20 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రవికుమార్ తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ పేరెల్లి కోటి, పి.మధు తదితరులు పాల్గొన్నారు. కాగా, కేయూ పీజీ కళాశాలలో ఖమ్మం శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యాన క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించగా ఖాళీగా పోస్టుల భర్తీకి అర్హత, నైపుణ్యం ఆధారంగా 9 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, శ్రీచైతన్య ప్రిన్సిపాల్ శర్మ, ఏఓ కృష్ణారావు తెలిపారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

నేలకొండపల్లి: ప్రభుత్వం వారబంధీ విధానం ద్వారా విడుదల చేస్తున్న సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.మానిక్‌రావ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ట్రాన్స్‌కో ఏఈ కె.రామారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఏఈలు నరేష్, మదీనా, రుత్విక్, ఏఈఓలు అరవింద్, శిరీష, అవినాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వసుధ వస్త్ర ప్రదర్శన


ఆభరణాలను పరిశీలిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్‌రోడ్డులో ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటుంది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ.. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కలకత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు తీసుకొచ్చి నగరవాసులకు పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ మైసమ్మగుడి 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వీఆర్‌కే సిల్క్ వెనకవైపు, వరదయ్యనగర్, ఈఆర్‌ఆర్ రిస్టార్ట్స్, మమత ఆస్పత్రిరోడ్డు తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని బాలపేటఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయనగర్‌కాలనీ, బాలపేట, హరిత గార్డెన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని బలేపల్లి సెక్షన్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. గణేశ్వరం పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు రఘునాథపాలెం మండలం గణేశ్వరం, వేపకుంట్ల, చింతగుర్తి, చెరువుకొమ్ముతండలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని రఘునాథపాలెం ఏఈ శంకర్ కోరారు.

నేడు న్యాయవాదులకు ఏఐపై అవగాహన

ఖమ్మం లీగల్: నగరంలోని గట్టయ్యసెంటర్ డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో ఐఏఎల్(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) ఆధ్వర్యాన శనివారం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్ పైన న్యాయవాదులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీష్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఈ తరగతులను వరంగల్ సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి, బెక్కం భగత్‌సేన్ బోధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

మాతృభాషా దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ విభాగాలు, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏజే రామారావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతీ నిమిషం విలువైనదే..


పరీక్ష సామగ్రి అందిస్తున్న జీసీడీఓ తులసి

కామేపల్లి: పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులకు ప్రతీ నిమిషం విలువైనదేనని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) తులసి అన్నారు. శుక్రవారం మండలంలోని పాతలింగాల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులకు ప్రణాళికబద్ధంగా చదవాలని, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారిని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. ఈసందర్భంగా 83 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, ఎస్ఓ స్వాతి, ఉపాధ్యాయులు జ్యోతి, జమున, పార్వతీ, శిరోమణి, మంగమ్మ, స్రవంతి, శాల్కు, భద్రమ్మ, రజిత, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ రైతు సంఘం జిల్లా నాయకుడు మంకెన రమేష్ మాట్లాడారు. మిర్చి క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసి ఈ నెల 22 నుంచి 26 వరకు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మార్చి 3 కలెక్టరేట్ ఎదుట రైతులు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె.మీరా, వాసిరెడ్డి ప్రసాద్, బొంతు సమత, వివిధ సంఘాల నాయకులు ఎస్‌కె.ఖాసిం, చుంచు విజయ్, కంపాసటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం నిర్మించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో వృద్ధాశ్రమం నిర్మించాలని సీబీఎఫ్ ఫౌండేషన్ చైర్మన్ జి.చంద్రశేఖర్ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధులకు సరైన వసతి లేక చనిపోతున్నారని, అందుకు వృద్ధాశ్రమాన్ని నిర్మించాలని కోరారు. వినతి అందించిన వారిలో సభ్యులు గంటా భీమయ్య, సప్పిడి నాని, పడిశాల వెంకట్, జి.రాధిక, డి.హర్ష, బి.హరిత, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ మాసోత్సవాలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని మంచికంటి భవన్‌లో టీపీఎస్‌కే, బీవీకే, ఈపీటీఆర్‌ఐ, ఈఐఏసీపీ హబ్‌ల ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన సైన్స్ మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కథారచన, వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం, కవితారచన తదితర కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు కంచెపు రాంబాబు, బహుమతులు అందజేశారు. సైంటిస్టుల వేషధారణ పోటీలు ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ సందర్భంగా విజ్ఞానదర్శిని వ్యవస్థాపకుడు రమేష్ మాట్లాడుతూ వైజ్ఞానిక ఆలోచన మానవులను ప్రగతి మార్గం వైపు నడిపిస్తుందన్నారు.

'న్యూవిజన్'కు బహుమతులు

ఖమ్మంసహకారనగర్: సైన్స్ మాసోత్సవాల్లో న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు ఐదు బహుమతులు గెలుచుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ.అబాద్‌అలీ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు హెచ్.నయశ్రీ, ఎండి.రిజ్వాన్‌అహ్మద్, డి.నిఖిల, మనస్వి, ఎం.నిదాఫిర్దోస్‌లను శుక్రవారం పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ జె.రమేష్ అభినందించారు.

తిరుమయపాలెంలో రెడ్ బుక్ డే..

తిరుమయపాలెం: రెడ్‌బుక్ డే సందర్భంగా తిరుమలాయపాలెంలోని గజ్జల వెంకటయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యాన సామూహిక అధ్యయన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ.. 1848 ఫిబ్రవరి 21న మార్క్స్ ఎంగిల్స్ రాసిన కమ్యూనిస్టు మేనిఫెస్టో విడుదలైన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ మహాసభల ముసాయిదాను సామూహికపఠనం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు దాసరి మహేందర్, బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకన్న, దిండు మంగపతి, సైదులు, మట్టా సుధాకర్, కోడి లింగయ్య, వీరన్న, వాసయ్య,.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు కె.జయదేవ్ చౌహాన్, ఎం.అక్షయ్ రుత్విక్‌లు ఇటీవల హైదరాబాద్లో టీఈఓఎస్ ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యాన నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చారని పాఠశాల డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, సీలిమలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడుతూ.. నేటి యువతలో సాంకేతిక, నైతిక నీతిని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రంజిత్, దాసరి శ్రీరామ్, సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'డీపీఎస్' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 3వ వార్షికోత్సవాన్ని నూతనంగా నిర్మించిన వశిష్ఠ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తుంబూరు దయాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కడారి రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తాలు మాట్లాడాక వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అధునాతన పద్ధతులతో వైద్య సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మానికి చెందిన 64 ఏళ్ల వృద్ధురాలు బేతల సుమిత్రకు హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రి బృందం అరుదైన గుండె ఆపరేషన్ చికిత్స చేసింది. ఈమేరకు శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో సోమాజిగూడ యశోద ఆస్పత్రి ఎండీ, డీ.ఎం(కార్డియాలజీ) డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ.. సుమిత్ర గుండెకు సంబంధించిన వ్యాధితో ఆస్పత్రిలో చేరినప్పుడు కరోనరీ యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి అధునాతన పద్ధతులతో చికిత్స అందించి నయం చేశామని, బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం కల్పించే హెల్త్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు హెల్త్ ఇన్సూరెన్సు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది..


ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కామేపల్లి: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైందని, ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కామేపల్లి, వైరా ఎంఈఓలు వెంకట్, వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లుకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక రైతు వేదికలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడగా.. కార్యక్రమంలో టీజీటీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు షౌకత్ అలీ, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగానాయక్, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్యాంసుందర్, టీఎస్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారావు, టీటీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణ, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.